ఆధ్యాత్మికతతోనే ఆనందం

మణికొండ: ప్రతి ఒక్కరిలో వారి మతాలు, కులాలకు అనుగుణంగా వారు నమ్మిన దేవుడిపై భక్తిని పెంచుకుని ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే ఆనందంగా జీవించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలోని ఎంఎల్‌ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి మనిషిలో ఆధ్యాత్మికత, ప్రేమ, సోదరభావం ఉండటంతో పాటు ఎదుటి వారిని గౌరవించేతత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇలాంటి ఆధ్యాత్మికత కార్యక్రమాలు, పూజలు, హోమాలు ఎంతో ప్రశాంతతను చేకూరుస్తాయన్నారు. సురేష్ గురుస్వామి, రాజన్ మహారాజ్ దూబే చేతుల మీదుగా మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. జంగిరెడ్డి భజన భక్తులను పరవశంలో ముంచెత్తింది. మహాపడి పూజ అనంతరం వట్టినాగుపల్లి మాజీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు స్వరూపనగేష్‌యాదవ్ దంపతులు అన్నదానం చేశారు. సన్నిదానం శివమాల స్వాములతో పాటు మండల పరిధిలోని శివస్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ద్వాదశ జ్యోతిర్లింగాల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

జాతీయ రహదారికి మోక్షమెప్పుడో ?


పెద్దషాపూర్ చౌరస్తా..


ఘాంసిమియాగూడ శివారులో జాతీయ రహదారి విస్తరణ పనులు

జాతీయ రహదారి విస్తరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పనుల్లో భాగంగా భద్రత చర్యలు కూడా సరిగ్గా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

- పనుల్లో జాప్యం.. వాహనదారులకు శాపం
- మందకొడిగా బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనులు

శంషాబాద్ రూరల్: మండలంలోని తొండుపల్లి శివారు నుంచి కొత్తూరు వరకు బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. నాల్గు లైన్ల రహదారిని ఆరు లైన్లకు విస్తరిస్తున్నారు. సుమారు ఏడాది క్రితం పనులు ప్రారంభం కాగా.. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పెరిగిన వాహనాల రద్దీ..

శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న ఈ 44వ నంబరు జాతీయ రహదారిపై ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ బాగా పెరిగింది. రాష్ట్ర, ఇతర రాష్ట్రాల వాహనాలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. తొండుపల్లి వద్ద ఉన్న ఔటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు షాద్‌నగర్ వైపు నుంచి రాకపోకలు సాగించేవారు ఈ మార్గంలోనే ప్రయాణం చేయాలి. వారాంతపు, సెలవు రోజుల్లో ట్రాఫిక్ మరింత పెరుగుతుంది. ముచ్చింతల్ వద్ద ఉన్న సమతాస్ఫూర్తి కేంద్రానికి సందర్శకుల తాకిడి కూడా పెరిగింది.

రహదారి టర్నింగ్‌లకు చెక్..

జాతీయ రహదారిని ఆరు వరసలకు విస్తరిస్తుండటంతో పాటు టర్నింగ్‌లను సైతం సరి చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గిపోతాయి. గండిగూడ, ఘాంసిమిగూడ, పెద్దషాపూర్‌తండా, మదన్‌పల్లితండా వద్ద టర్నింగ్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని సరి చేస్తుండటంతో భవిష్యత్తులో వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయి.

కల్వర్టుల నిర్మాణం..

ప్రస్తుతం రహదారిపై కల్వర్టులు, రోడ్డుకు ఇరువైపులా వరదనీటి కాలువల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. ఘాంసిమియాగూడ శివారులో కల్వర్టు నిర్మాణ ప్రాంతంలో రెండు నెలల క్రితం ప్రమాదం జరిగి ఇద్దరు మృతి చెందారు. రోడ్డు పక్కన భద్రత చర్యల లోపంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

విస్తరణ ప్రణాళికపై అభ్యంతరాలు..

రహదారి విస్తరణ కోసం రూపొందించిన ప్రణాళికపై స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. పెద్దషాపూర్, పాల్మాకుల గ్రామాల వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ రోడ్డు దాటే సమయంలో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రస్తుతం చేపట్టిన విస్తరణ పనుల్లో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికుల వాదన.

- పెద్దషాపూర్ వద్ద అండర్‌పాసు నిర్మించాలని స్థానికులు ఇది వరకే జాతీయ రహదారి విభాగం అధికారులను కోరారు. ఇక పాల్మాకుల వద్ద అండర్‌పాస్ కాకుండా పై వంతెన నిర్మాణం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన నలుగురికి జైలు

శంషాబాద్: శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 17 మందిని ట్రాఫిక్ పోలీసులు బుధవారం రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చారు. వీరిలో నలుగురు వ్యక్తులకు న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించగా.. మిగతా వారికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ రాజు సూచించారు.

నేడు జర్మన్‌టెక్ ఆస్పత్రిలో నూతన బ్లాక్‌లు ప్రారంభం

అత్తాపూర్: అత్తాపూర్‌లోని జర్మన్‌టెక్ ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగం, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ విభాగం బ్లాక్‌లను ప్రారంభించేందుకు గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల డాక్టర్లు హాజరవుతారన్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై ఆర్డీఓ సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో వచ్చే పార్లమెంటు ఎన్నికలపై ఆర్డీఓ వెంకట్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో సంబంధిత అధికారులు గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే వారి విధులు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. అనంతరం ఆర్డీఓను తహశీల్దార్ రాములు సన్మానించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కాంగ్రెస్ అధ్యక్షుడు కె.బాల్‌రాజ్, కాంగ్రెస్ నాయకుడు ధనుంజయ, మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరిస్తాం


మణికొండ ఏఈ జ్ఞానేశ్వర్

మణికొండ: విద్యుత్ వినియోగదారులకు సరఫరా సమస్యలతో పాటు శాఖాపరమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని మణికొండ ఏఈ జ్ఞానేశ్వర్ కోరారు. బుధవారం ఆయన పుప్పాల్‌గూడలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాబోయే వేసవికాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. విద్యుత్ వినియోగం పెరగటం, ఇతర సమస్యల వలన సరఫరా నిలిచిపోతే వెంటనే తమ ఫ్యూజ్ కాల్ కార్యాలయం ఫోన్ నెంబర్ 9493193119, ఏఈ మణికొండ 0440813097, ఏడీఈ ఇబ్రహింబాగ్ 9440813060, డీఈ ఇబ్రహింబాగ్ 8901093677, ఎస్ఈ సైబర్‌సిటీ 9440813046 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. తమతో పాటు సిబ్బంది, ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బండ్లగూడ: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని శివసాయినగర్ ఫేజ్–2 అసోసియేషన్ వారి విజ్ఞప్తి మేరకు బుధవారం ఆయన కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని, కార్పొరేషన్ తరఫున ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చే ఆటోరిక్షా కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. శివసాయినగర్‌లో నెలకొన్న ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, కాలనీ ప్రెసిడెంట్ సురేష్, కాలనీ సెక్రటరీ మోహన్, శానిటరీ జవాన్లు, స్వచ్ఛ ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: మున్సిపాలిటీల పరిధిలో ఉన్న సమస్యలపై అవగాహన పెంచుకుని వాటి పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మణికొండ మున్సిపల్ కమిషనర్ నెక్నాంపూర్ చెరువులలో గుర్రపు డెక్క పెరిగి దోమల సమస్య తీవ్రంగా పెరిగిందని, వాటిని నివారించాలని కౌన్సిలర్ నవీన్‌కుమార్ ఫిర్యాదుతో ఆయన చెరువు పరివాహకంలో పర్యటించారు. చెరువులో గుర్రపు డెక్క పెరిగిపోతున్నా.. వాటిని దత్తత తీసుకున్న సంస్థలు పట్టించుకోవటం లేదని కౌన్సిలర్ వివరించారు. 100 అడుగుల రోడ్డులో వర్షపునీరు పోయే లైన్‌పై మట్టిపోసి పూడ్చారని కౌన్సిలర్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల అవసరాలకు కోసం వదిలిన స్థలాలను కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో కమిషనర్ గుర్రపు డెక్క తొలగించని సంస్థల వారిని పిలిచి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావసరాల స్థలాలను వెంటనే మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని స్పష్టం చేశారు. డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక తదితరులు పాల్గొన్నారు.

- నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం 17వ వార్డులో ఉన్న గొల్లబావిలో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి పెరుగుతుందని, పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో బ్యాలెట్ బాక్స్‌లను పెట్టడంతో వార్డు కార్యాలయం లేకుండా పోయిందని కౌన్సిలర్ ఉషారాణి కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. త్వరలోనే ఆ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని కమిషనర్ చెప్పారు. డీఈ నరసింహరాజు, శానిటేషన్ సూపర్‌వైజర్ లచ్చిరాం సిబ్బంది పాల్గొన్నారు.


శివసాయినగర్ ఫేజ్-2లో మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర


నార్సింగి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించిన కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


నెక్నాంపూర్ చెరువును పరిశీలించిన మణికొండ కమిషనర్ ప్రదీప్‌కుమార్

ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం


పీఅండ్‌టీ కాలనీలో హైమాక్స్ లైట్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ మేయర్

బండ్లగూడ: ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని మెరుగైన వసతులు కల్పించడం జరగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్ అన్నారు. 7వ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీ బి–బ్లాక్‌లో ప్రజల సౌకర్యార్థం హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ లైట్లను బుధవారం రాత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాత్రి సమయంలో లైట్లు సరిగ్గా వెలకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతూ.. ప్రమాదాలకు గురౌతున్నారన్నారు. దీంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా హైమాస్క్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. మిస్బావుద్దీన్, ఆరిఫ్, కుద్బుద్దిన్, అబుబాకర్, ఇక్బాల్, రసూల్, రాజు గరుబ్, ఉస్మాన్, నదీం, బురాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెల్మెట్ల పంపిణీ

అత్తాపూర్: రోడ్డు భద్రతా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి సూచించారు. ముంబై పట్టణానికి చెందిన యంగిస్థాన్ ఫౌండేషన్, అత్తాపూర్ హెచ్ఎస్‌బీసీ ఉషోదయ హైస్కూల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా జరిగిన రోడ్డు సెఫ్టీ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులకు 150 హెల్మెట్లను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి బయటికి వెళ్లే విద్యార్థులు పనులు చేసుకునే కార్మికులు, కర్షకులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదవశాత్తు ఎంతో మంది తలకు బలమైన గాయాలు తగలడంతో మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. వాహనంపై వెళ్లినప్పుడు మాత్రమే హెల్మెట్ ధరించాలనే ఆలోచన నుంచి బయటికి రావాలని, పనులు చేసుకునే సందర్భంలో సైతం హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఉచితంగా హెల్మెట్‌లు అందజేసిన ఫౌండేషన్ నిర్వాహకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అత్తాపూర్ ఎస్సై శ్రీనివాస్, ఫౌండేషన్ సీఈఓ అరుణ్ గోపాల్ కృష్ణ, ప్రవీణ్‌కుమార్, శోభా, సంగీత, శివానీ, నరేందర్‌రెడ్డి, వేంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్లను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్

అభివృద్ధి పనులు ప్రారంభం


బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లో బీటీ రోడ్డు అభివృద్ధి పనులను అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ పిల్లర్ నంబర్ 176 సమీపంలోని చింతల్‌మెట్ వెళ్లే ప్రధాన రహదారిలో రూ.14 లక్షలతో బీటీ రోడ్డు అభివృద్ధి పనులను బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని రోడ్డు నిర్మాణ పనులు తమ హయాంలో నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు ముందుంటామన్నారు. ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ మధుసూదన్‌రావు, బీజేపీ నాయకులు బిటుకూరి సిద్దేశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా సమ్మక్క, సారక్క పూజలు


నెక్నాంపూర్ దేవాలయం వద్ద భక్తుల సందడి

మణికొండ: మేడారంలోని సమ్మక్క, సారక్కల వద్దకు వెళ్లలేని భక్తులు మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అమ్మవారి దేవాలయంలో పూజలు, మొక్కులు చెల్లించుకుంటారు. బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభం కాగా.. ఇద్దరు అమ్మలను గద్దెలపై ప్రతిష్ఠింపజేసి ఘనంగా మొదటి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెక్నాంపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలు, హైదరాబాద్ నగరానికి చెందిన భక్తులు ప్రతి రెండేళ్లకోసారి పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొంటారు. శివసత్తులు ముందు నడవగా వారి వెంట గ్రామస్తులు దేవాలయానికి చేరుకుని అక్కడే నైవేద్యాలను తయారు చేసి అమ్మవార్లకు సమర్పిస్తారు. గురు, శుక్రవారాలు పూజలు కొనసాగుతాయని, భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని దేవాలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

భాష, సంస్కృతి ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి

గచ్చిబౌలి: నీతి, నిజాయితీ, మంచి నడవడిక నేర్పేది మాతృభాషయేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి వారిజారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి డివిజన్‌లోని కొండాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి భాషలేనిదే మానవజాతికి వికాసం లేదని, అన్యభాషలు ఎన్ని నేర్చుకున్నా మాతృభాషలో ప్రావీణ్యుడు కాలేనివాడు విజ్ఞాన సముపార్జన చేయలేడని స్పష్టం చేశారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన తల్లి భాష నేడు తల్లడిల్లుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచ వ్యాప్తంగా వేల కొలది మాతృభాషలు కనుమరుగయ్యే పరిస్థితులు ఉన్నాయంటూ యునెస్కో హెచ్చరిస్తుందని గుర్తు చేశారు.

నేడు బీజేపీ కార్నర్ మీటింగ్

శంషాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంటు నియోజకర్గ పరిధిలో జరుగుతున్న బస్సుయాత్ర గురువారం శంషాబాద్ పట్టణానికి చేరుకోనుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో జరిగే కార్నర్ మీటింగ్‌లో ఎంపీ లక్ష్మణ్, జాతీయ నాయకులు మురళీధర్‌రావు తదితరులు పాల్గొననున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలి రావాలన్నారు.

అవిశ్వాసం గట్టెక్కేనా ?

- నేడు మణికొండ మున్సిపల్ ప్రత్యేక సమావేశం
- గోవాలోనే చైర్మన్‌తో పాటు 7 మంది సభ్యులు
- 13కు చేరని ప్రతిపక్ష సభ్యుల బలం
- అవిశ్వాసం వీగిపోయే అవకాశం


మణికొండ మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశం నేడు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపాలిటీలో 20 మంది సభ్యులు ఉండటంతో చైర్మన్‌ను దించేందుకు 2/3 (13 మంది) సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. కాగా మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్‌కు 8 మంది కౌన్సిలర్ల మద్దతు ఉండగా.. ఆయనను దించేందుకు 10 మంది సంతకాలతో జిల్లా కలెక్టర్‌కు లేఖను అందించిన విషయం తెలిసిందే. సంతకాలు చేసిన వారిలో బీఆర్ఎస్ 6 మంది, బీజేపీకి చెందిన ముగ్గురు, కాంగ్రెస్‌కు చెందిన ఒక సభ్యుడు ఉన్నారు. అనంతరం వారితో స్వతంత్ర కౌన్సిలర్ కె.లక్ష్మీనాగేశ్వర్‌రావు జత చేరారు. దీంతో వారి బలం 11కు చేరింది. బీజేపీ పార్టీకే చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి ఇప్పటి వరకు తటస్థంగా ఉన్నారు. చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌ను పదవి నుంచి దించేందుకు 12 మంది సభ్యుల బలం చేకూరితే వారికి అండగా నిలుస్తానని వైస్ చైర్మన్ మాట ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు అసమ్మతిని బహాటంగా వ్యక్తం చేసిన వారు 11 మంది ఉండటం, వైస్ చైర్మన్ మద్దతు ఇచ్చిన వారి సంఖ్య 12కు చేరనుంది.

గోవాలోనే చైర్మన్ వర్గం..

మణికొండ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన 11 మంది కౌన్సిలర్ల బలంతో ఆయనను పదవీచ్యుతున్ని చేసే అవకాశం లేదు. అది జరగాలంటే కౌన్సిలర్ల సంఖ్య 13 మంది ఉండాల్సిందే. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అవిశ్వాసం పెట్టిన వారు వారి బలాన్ని పెంచుకునే ప్రయత్నంలో విఫలం అయినట్టే అనిపిస్తుంది.

- చైర్మన్‌కు మద్దతుగా ఉన్న 8 మంది కౌన్సిలర్లలో నుంచి ఒకరు అసమ్మతి వైపు వస్తేనే ఆయనను పదవీచ్యుతున్ని చేసే అవకాశం ఉంటుంది. దీనికి భిన్నంగా ఆయనకు మద్దతుగా ఉన్న 7 మంది కౌన్సిలర్లతో పాటు చైర్మన్ గోవాలో క్యాంప్‌లో ఉండటం, అవిశ్వాస ప్రత్యేక సమావేశానికి గురువారం వారు వచ్చే అవకాశం ఏమాత్రం లేదని అతని వర్గీయులు చెబుతున్నారు. అవిశ్వాసం ప్రకటించి సంతకాలు చేసిన 10 మంది కౌన్సిలర్లు, వారికి తర్వాత మద్దతు ఇచ్చిన మరో స్వతంత్ర సభ్యరాలు సమావేశానికి వచ్చినా.. అవిశ్వాస తీర్మానం వీగిపోయే అవకాశమే ఎక్కువగా ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు పేర్కొన్నారు. అవిశ్వాసం వీగిపోయిన తరువాతనే చైర్మన్‌తో పాటు ఆయనకు మద్దతుగా ఉన్న 7 మంది కౌన్సిలర్లు గోవా నుంచి తిరుగుపయనం అయ్యేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం.

రూ. 3 కోట్లతో వాకింగ్ ట్రాక్ అభివృద్ధి


వాకింగ్ ట్రాక్

అత్తాపూర్: పెద్ద తాళ్లకుంటలో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ వారు రూ. 3 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చారు. పూర్తిస్థాయిలో వాకింగ్ ట్రాక్ గ్రీనరీ ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలకు మరింత మేలు జరుగుతుంది. లేక్స్ అభివృద్ధిలో భాగంగా జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ శాఖ ఐదేళ్ల క్రితం రూ.60 లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసింది. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు 1000 మంది వరకు వాకింగ్ చేస్తుంటారు. సుమారు 4 ఎకరాల్లో ఉన్న దీన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే ప్రజలకు మరింతగా ఉపయోగపడుతుంది. సంబంధిత అధికారులతో కలిసి ఇప్పటికే పలు దఫాల్లో సమావేశం అయ్యారు. త్వరలోనే కార్యరూపం దాలుస్తుందని రాజేంద్రనగర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) నరేంద్రగౌడ్ వివరించారు. తాళ్లకుంట సమీపంలోనే జీఎస్టీ కార్యాలయం ఉన్నందున పెద్ద తాళ్లకుంట లేక్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం హర్షనీయం.

ప్రభుత్వం ముందుకు రావడం సంతోషం..



నగరంలో కనుమరగువుతున్న చెరువులు, కుంటలను రక్షించేందుకు ప్రభుత్వం ఎక్కడికక్కడ వాకింగ్ ట్రాక్‌లు, గ్రీనరీ పార్కులను అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం సంతోషం. అసంపూర్తిగా ఉన్న వాకింగ్ ట్రాక్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే ప్రజలకు మరింతగా ఉపయోగపడుతుంది. హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన ల్యాండ్ మార్క్‌గా పెద్ద తాళ్ల కుంట అభివృద్ధి జరుగుతుంది.

– ఎలక శ్రీనివాస్‌రెడ్డి, హైదర్‌గూడ

మరింతగా గ్రీనరీ పెరుగుతుంది..



నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్టర్ టాక్సెస్ అండ్ నార్కొటిక్స్ జోనల్ క్యాంపస్ హైదరాబాద్ జీఎస్టీ కార్యాలయం పెద్ద తాళ్ల కుంట లేక్‌ను రూ.3 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. జీహెచ్ఎంసీ ఇరిగేషన్ శాఖ, జీఎస్టీ శాఖ అధికారులు ఒకరినొకరు పరస్పరం చర్చించుకుంటున్నారు. పూర్తిస్థాయిలో వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు మరింతగా గ్రీనరీ పెరుగుతుంది.

– రవికుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

చెరువులతోనే మనుగడ


నెక్నాంపూర్ చెరువును సందర్శించిన జార్ఖండ్ టౌన్ ప్లానింగ్ అధికారులు

మణికొండ: మన చుట్టూ ఉన్న చెరువులు, వాగులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వాటితోనే జీవరాశులతో పాటు మానవుల మనుగడ సాధ్యమని ధ్రువాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చిన్న చెరువును బుధవారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన టౌన్‌ప్లానింగ్ అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నెక్నాంపూర్ చిన్న చెరువును అభివృద్ధి చేసిన తీరు, చెరువు వద్ద పెరిగిన జీవరాశుల వివరాలను వారికి తెలియజేశారు. చెరువులో తేలియాడే భూమి, నీటి ఫౌంటెన్లు ఏర్పాటు చేయటంతో నీటిలో ఆక్సిజన్ శాతం పెరిగి అన్ని జీవరాశులు మనుగడ సాగిస్తున్నాయన్నారు. జార్ఖండ్‌కు చెందిన 30 మంది టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నేతాజీనగర్‌లో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, కోశాధికారి రామేశ్వరం రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లేశం ముదిరాజ్, ప్రతినిధులు మహేష్ కురుమ, సంతోష్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.